క్లుప్తంగా

రేపు తైబజార్ వేలం

ధన్వాడ: మండల కేంద్రం పంచాయతీ ఆధ్వర్యంలో తైబజార్ వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రావు బుధవారం తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఉంటుందని తెలిపారు. గతేడాది రూ.3 లక్షలకు వేలం జరిగిందని పేర్కొన్నారు. కూడా వేలంలో పాల్గొనే వారు ఉదయం 9 గంటల లోపు కార్యాలయానికి రావాలని సూచించారు.

నేడు పంటల సాగుపై సదస్సు

నారాయణపేట: తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 11 గంటలకు వానాకాలం పంటల సాగు ప్రణాళికపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి అంజిలయ్య గౌడ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. సదస్సుకు రాష్ట్ర కార్యదర్శి సాగర్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు ఎరువులు విత్తనాలు యాంత్రీకరణ శాస్త్రీయ పద్ధతుల్లో వ్యవసాయం మెలుకువలు వంటి అంశాలపై వివరిస్తారని తెలిపారు. సదస్సుకు జిల్లాలోని రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మొలకెత్తని విత్తనం



మరికల్: ముందుగా నాటిన విత్తనాలకు సకాలంలో వర్షాలు లేక మొలకెత్తలేదు. దీంతో మళ్లీ పొల్లాలను చదును చేసి పత్తి విత్తనాలను నాటే పనిలో రైతులు ఉన్నారు. మండలంలో గత నెలలో దాదాపు 2వేలకు పైగా ఎకరాల్లో రైతులు పత్తి విత్తనాలు నాటారు. మొదట్లో కురిసిన వర్షం కొంతమంది రైతులకు విత్తనాలు మొల్లకెత్తగా, కొందరివి మొల్లకెత్తకపోవడంతో అలాంటి పొలాలను చెరిపివేసి ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మళ్లీ విత్తనాలు నాటుతున్నారు. దీంతో రెండు సార్లు విత్తనాలు నాటడం వల్ల అదనపు ఖర్చుల భారం పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పేదలకు సరుకుల పంపిణీ

మక్తల్: పట్టణంలో గామా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యవసర సరుకులను జిల్లా కోఆర్డినేటర్ జీవన్ బుధవారం అందజేశారు. కార్యక్రమంలో వలంటీర్లు మహదేవ్, అశోక్, కర్ణాకర్, భగవంతు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

నల్లా కనెక్షన్లపై సర్వే



మాగనూర్: మిషన్ భగీరథ నల్లాల కనెక్షన్ల సర్వేను మండల కేంద్రం, గురులింగంపల్లిలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి కృష్ణమాచారి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జైపాల్‌రెడ్డి పంచాయతీ సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరిగి వివరాలను సేకరించారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా నల్లా కనెక్షన్ల నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీరు వస్తుందా? లేదా అనే అంశంపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా నీటి సరఫరా లేకుంటే పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలని తెలిపారు. అనంతరం ఎంపీడీఓ సమావేశ మందిరంలో కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ప్రభుత్వ స్థలాలు పరిరక్షించేందుకు చర్యలు



అమరచింత: పట్టణంలోని ప్రభుత్వ స్థలాలతో పాటు, డీటీసీపీ లేఅవుట్ల ద్వారా మున్సిపాలిటీకి అప్పగించిన 10శాతం స్థలాల పరిరక్షణ బాధ్యతలను మున్సిపల్ వార్డు ఆఫీసర్లకు అప్పగిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నురుల్ నదీం తెలిపారు. పట్టణంలోని లేఅవుట్లలో గల పది శాతం స్థలాలను గుర్తించడంతో పాటు వాటిలో మొక్కలను పెంచేందుకు శ్రీకారం చుట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ నేపథ్యంలో సిబ్బందితో కలిసి లేఅవుట్లను సందర్శించారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో పాటు కలెక్టర్ ఆదేశాల మేరకు స్థలాలను గుర్తిస్తున్నామని పేర్కొన్నారు. పట్టణంలో బిలకంటి గోవర్ధన్, మరేడి నరేష్‌రెడ్డి, పోసిరిగారి తిరుమలేష్, తాటికొండ రమేష్, రంగు యశోదమ్మ, మరెడి సాయిరెడ్డితో పాటు మియవాకిలోని లేఅవుట్లను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్‌ఐ కృష్ణయ్య, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

నులిపురుగులను నివారిద్దాం

మరికల్: మండల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ర్యాలీ చేపట్టారు. అనంతరం డాక్టర్లు కిరిటి, హర్షిత మాట్లాడుతూ సీజన్‌లో వచ్చే అంటు వ్యాధులను నివారించేందుకు చిన్నారులకు నులి మాత్రలను వేయించాలని తెలిపారు. మండల కేంద్రంలో ర్యాలీగా వెళ్లి నులి పురుగుల వల్ల కలిగే నష్టాలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది బస్వరాజ్, సువర్ణ, స్వరూప పాల్గొన్నారు.

మక్తల్: మండలంలోని కర్నిలో బుధవారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. జీఎచ్‌ఎం వెంకటయ్య, డాక్టర్ తిరుపతి, ఎల్లప్ప, రూప, సులోచన, చెన్నకేశవ, సాయిబాబా, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని పెద్దజట్రంలో జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా బుధవారం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి భవాని మాట్లాడుతూ ఏడాది నుండి 19 ఏళ్ల వయసు గల వారు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలలో నులిపురుగుల నివారణపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయ్‌కుమార్, ఏఎన్‌ఎం గోవిందమ్మ, శైలజ, నర్సింహులు, మణిమాల తదితరులు పాల్గొన్నారు.



మరికల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది



మక్తల్ మండలం కర్నిలో..



పెద్దజట్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

విద్యతోనే సమగ్ర అభివృద్ధి

కోస్గి: విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని, స్వచ్ఛంద సంస్థలు, ధనిక వర్గాలు తమ చేతనైనంతలో పేద విద్యార్థుల చదువులకు చేయూత నివ్వాలని నాగుసాన్‌పల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వీరయ్య సూచించారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని నాగుసాన్‌పల్లి పాఠశాల, తిమ్మాయపల్లి, గుండ్లపల్లి, మాసాయపల్లి, బీసీ కాలనీ, గాంధీ స్మారక, బాలికల ప్రాథమిక పాఠశాలలతోపాటు మండలంలోని పీసీతండా, భక్తిమళ్ల, ముక్తిపాడ్, బొల్నోన్‌పల్లి, సర్జఖాన్‌పేట ప్రాథమికోన్నత పాఠశాలల్లో పట్టణానికి చెందిన బీచ ప్రకాష్ 500 మంది విద్యార్థులకు నోట్ బుక్కులు, బ్యాగులు ఇతర విద్యా సామగ్రి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు చేతనైన సహాయసహకారాలు అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు సైతం కష్టపడి చదివి ఉన్నత విద్యావంతులుగా మారాలన్నారు.



విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న దాతలు

విద్యార్థులకు పుస్తకాలు అందజేత



జాజాపూర్‌లో అభ్యాస దీపికలు పంపిణీ చేస్తున్న జీహెచ్‌ఎం

నారాయణపేట రూరల్: మండలంలోని జాజాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం అభ్యాస దీపిక పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాల జీహెచ్‌ఎం భారతి మాట్లాడుతూ.. విద్యార్థి దశలో పదో తరగతి ఎంతో ప్రాముఖ్యత కలిగినదని, కష్టపడి చదువుకుని చక్కటి జీపీఏ సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భానుప్రకాష్, శోభారాణి, విజయ్‌కుమార్, మధుసూదన్‌రావు, కృష్ణవేణి, సురేఖ, శిరీష, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కృష్ణా: ప్రతి విద్యార్థికి నోట్ బుక్స్‌ను అందించడం జరుగుతుందని మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం కిశోర్‌కుమార్ అన్నారు. బుధవారం పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యార్థులకు అవసరమయ్యే నోట్ బుక్స్‌ను అందించారు. ఉపాధ్యాయులు నాగరాజ్, మహేష్‌కుమార్, అజయ్, హనుమదాస్, నారాయణ, గుర్నాల్ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణాలో నోట్‌బుక్స్ అందిస్తున్న జీహెచ్‌ఎం కిశోర్

ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు



జిల్లా కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న శివకుమార్‌రెడ్డి

నారాయణపేట: భారత్ జోడో యాత్ర, భారత్ న్యాయ్ యాత్ర ద్వారా దేశంలో ఏ నాయకుడు చేయని విధంగా అన్ని రాష్ట్రాలలో పాదయాత్ర చేసి ప్రజల కష్టాలను తెలుసుకున్న ప్రజా నాయకుడు రాహుల్ గాంధీ అని మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి పార్టీ శ్రేణులకు తినిపించారు. అయన మాట్లాడుతూ రాహుల్ గాంధీకి దేశ ప్రధాని అయ్యే అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. రాబోయే రోజుల్లో ప్రధాని చేయడమే ధ్యేయంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సలీం, సుధాకర్, శివారెడ్డి, నరహరి, రవీందర్‌రెడ్డి, గౌస్, దామోదర్ రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మరికల్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని బుధవారం రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. మండలంలోని పూసల్‌పహాడ్, రాకొండలో ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హర్షవర్ధన్ రెడ్డి, హరీష్, కృష్ణయ్య, రఘు, రామకృష్ణ, మొగులప్ప, సత్యన్న, ఆంజనేయులు, మల్లేష్, రవి, చెన్నయ్య, రాజు పాల్గొన్నారు.

మక్తల్: రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా పట్టణంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కేక్ కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర నిర్వహించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు న్యాయం లభిస్తుందని తెలిపారు. పార్టీపై ప్రజలకు ఎంతో నమ్మకం ఉందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా ఏమిటో చూపాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, నరేందర్, బోయ రవి, షంషోద్దీన్, తాయప్ప, ఫయాజ్, రవికుమార్, రాజేందర్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



మక్తల్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

బాధిత కుటుంబానికి పరామర్శ

మాగనూర్: మండలంలోని వర్కూర్ చెందిన కాంగ్రెస్ నాయకుడు అనిల్‌కుమార్‌రెడ్డి తండ్రి లక్ష్మిరెడ్డి మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి బుధవారం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మనోధైర్యంగా ఉండాలని అన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలి



గద్వాల అర్బన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న పుస్తకాలను పట్టుకున్నారు. ఈ విషయంపై ఎంఈఓకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న ఎంఈఓ పాఠశాలల దగ్గరకు చేరుకుని పుస్తకాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు పుస్తకాలు, యూనిఫాం, టై, షూలను విక్రయిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. పాఠశాలలకు సంబంధించిన బుక్స్‌ను బుక్ సెంటర్ల నిర్వాహకులతో ఒప్పందాలు చేసుకోని విద్యార్థులకు విక్రయిస్తున్నారన్నారు. దీనిపై పట్టించుకోవాల్సిన విద్యాశాఖ అధికారులు ప్రైవేటు పాఠశాలలకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. వెంటనే బుక్స్‌ను విక్రయిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు హలీమ్ పాష, టీఎస్ఎస్ఎఫ్ నాయకుడు సుభాన్, యూఎస్ఎఫ్ఐ నాయకుడు రంగస్వామి, ఎంఎస్ఎఫ్ నాయకులు మహేష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాల అందజేత



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆల్‌ఇండియా సౌత్‌జోన్ పోటీలలో పాల్గొని ఆర్చరీ, కోకో, వాలీబాల్ పోటీలలో ప్రతిభ చూపారు. ఈమేరకు పోటీలలో పాల్గొన్న వారికి కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ ప్రశంసా పత్రాలు అందజేసి, అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు ఆటల్లో కూడా రాణించాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా సులువుగా ఉద్యోగాలు పొందవచ్చన్నారు. అదేవిధంగా ఆటలతో మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో పీయూ పీడీ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ గంగాధర్, లావణ్య, విజయలక్ష్మి, సురయజబీన్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ పట్టణంగా మారుద్దాం

అమరచింత: పట్టణాన్ని స్వచ్ఛతలో ముందుంచి సంపూర్ణ పారిశుద్ధ్య పట్టణంగా మార్చుకునేందుకు ప్రజలు మున్సిపాలిటీకి సహకరించాలని చైర్‌పర్సన్ మంగమ్మ కోరారు. పట్టణంలోని ఐదో వార్డులో రూ.ఏడు లక్షలతో నిర్మించిన సామూహిక మరుగుదొడ్డిని బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఇప్పటి వరకు కొత్తగా ఐదు సామూహిక మరుగుదొడ్లను నిర్మించినట్లు తెలిపారు. స్థల ప్రభావంతో సమస్యను ఎదుర్కొంటున్న ప్రాంతాలను గుర్తించి ఈ నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. బస్టాండ్ రహదారిలో మహిళలు, పురుషుల సౌకర్యార్థం నిర్మించామన్నారు. రాజకీయాలకు అతీతంగా అమరచింత పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ నురుల్ నదీం తదితరులు పాల్గొన్నారు.



మరుగుదొడ్డిని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

పెండింగ్ వేతనం విడుదల చేయాలి

మాగనూర్: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనం విడుదల చేయాలని తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చే గౌరవ వేతనం, ఏళ్ల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి పెట్టుబడి పెట్టి వంట చేసి చేస్తున్నారని తెలిపారు. గృహలక్ష్మి పథకం పేరుతో గ్యాస్ సిలిండర్ రూ.500కు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించి అమలుకు శ్రీకారం చుట్టిందని ఈ పథకం ద్వారానే మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు అవసరమైన గ్యాస్‌ను సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మధ్యాహ్న భోజన కార్మికులకు రూ. 10 వేలు వేతనం అమలు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే 24వ తేదిన రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, మంగమ్మ, స్వర్ణలత, నర్మద, ఉమాదేవి, గంగమ్మ, శాంతమ్మ, తాహేర, సులోచనమ్మ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలి



మక్తల్‌లో మాట్లాడుతున్న సూర్యం

మక్తల్: మిషన్ భగీరథ కార్మికులకు జీఓ నంబరు 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో మిషన్ భగీరథ కార్మికుల జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో 20 వేల మంది కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. వీరికి వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసే లైన్‌మన్‌లకు ప్రయాణ చార్జీలు ఇవ్వడం లేదని విమర్శించారు. పీఎఫ్, ఈఎస్‌ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కిరణ్, ఏజీ భుట్టో, రాము, ఆంజనేయులు, నర్సింహారెడ్డి, శ్రీను, మునీర్, శాష, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంను సన్మానించిన నాయకులు

కోస్గి: గుండుమాల్ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల కొత్త జీహెచ్‌ఎం శేఖర్‌రెడ్డిని బుధవారం పలు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. ఉపాధ్యాయుల సహకారంతో కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హెచ్‌ఎం ఈ సందర్భంగా తెలిపారు. సన్మానించిన వారిలో పీఆర్టీయూ, తపస్, యూటీఎఫ్ మండలాల ప్రతినిధులు ప్రకాష్‌గౌడ్, రవీందర్ నాయక్, నర్సింహులునాయక్, చెన్నయ్య, మనోహర్, సత్యనారాయణ, రాకేష్, భాను ప్రకాష్‌రెడ్డి, స్వర్ణలత, అంబిబాయ్, వనజ తదితరులు ఉన్నారు.



జీహెచ్‌ఎంను సన్మానిస్తున్న నాయకులు

‘108’ అంబులెన్స్ ఈఎన్‌టీకి సన్మానం



రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఈఎంటీలు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని 108 అంబులెన్స్‌లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ)గా విధులు నిర్వహిస్తున్న రాజ్‌కుమార్‌ను బుధవారం జిల్లాలో ఈఎంటీలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని పేరపళ్లకు చెందిన రాజ్‌కుమార్ పదేళ్లుగా ఈఎంటీగా పనిచేస్తూ రోడ్డు ప్రమాదబాధితులు, గర్భిణులు, చిన్నారులకు అవసరమైన వైద్య సాయం అందించి, రాష్ట్రంలోనే రెండవ స్థానంలో నిలిచే విధంగా అత్యుత్తమ సేవలను అందించినందుకు సన్మానం చేసినట్లు తెలిపారు. అదేవిధంగా స్టార్ ఈఎంటీ అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని ఈఎంటీలు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన తప్పనిసరి

నారాయణపేట: ప్రభుత్వం నిర్ణయం మేరకు కొత్త చట్టాలపై ప్రతి ఒక్క పోలీస్ అధికారి సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ మహేస్, సీఐ శివశంకర్ తెలిపారు. జులై ఒకటి నుంచి కొత్త చట్టాల అమలులో భాగంగా బుధవారం ఎస్పీ కార్యాలయంలోని జిల్లా పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినీయం -2023 పూర్తిగా అవగాహన కలిగి ఉన్నప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వర్తించగలమన్నారు. నేర్చుకోవాలనే తపన మనలో ఉన్నప్పుడే సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు. పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉన్నప్పుడే ప్రజలకు సరైన న్యాయం అందించి, నేరస్తులకు శిక్షలు వేయించగలమని అధికారులకు సూచించారు. సమావేశంలో కోస్గి సీఐ సోమ నర్సయ్య, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ శివశంకర్

మొహర్రంను సాంస్కృతిక జాబితాలో చేర్చాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మత సామరస్యానికి ప్రతీక అయిన మొహర్రంను తెలంగాణ సాంస్కృతిక పండుగల జాబితాలో చేర్చాలని.. పీర్ల పండుగ నిర్వాహకుల సంఘం నాయకులు ఎంఏ రహీం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆ సంఘం ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణచౌరస్తాలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామ గ్రామాన పీర్ల పండుగను కుల మతాలకతీతంగా ఘనంగా నిర్వహిస్తారన్నారు. తెలంగాణ ఉద్యమంలో కూడా పీర్ల పండుగ భాగమైందన్నారు. ఇటువంటి పీర్ల పండుగను రాష్ట్రం సాధించుకున్నాక కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. అనేక గ్రామాల్లో పీర్ల పండుగ నిర్వహణ కోసం నిజాం ప్రభుత్వం కేటాయించిన మాన్యాలు అన్యాక్రాంతమైనా చోద్యం చూశారని విమర్శించారు. ఆంధ్ర పాలకుల సమయంలోనూ పండుగ నిర్లక్ష్యానికి గురైందన్నారు. రాష్ట్రం సాధించుకున్నాకైనా పండుగకు గుర్తింపు వస్తదని ఆశించామని.. కానీ అప్పటి కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వమైనా గుర్తింపు ఇస్తుందని ఆశిస్తున్నామన్నారు. పండుగ నిర్వహణకు ప్రభుత్వం గ్రాంట్ రిలీజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. అన్యాక్రాంతమైన మాన్యాలను స్వాధీన పరుచుకొని పీర్ల పండుగ అభివృద్ధి కొరకు ఉపయోగపడేటట్టు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎంఏ రహీం, గట్టన్న ముదిరాజ్, ఎండీ సమీర్ మియా పాల్గొన్నారు.



తెలంగాణ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న పీర్ల పండుగ నిర్వాహకుల సంఘం నాయకులు